

నా దేశాటనం డైరి

మువ్వారి రామిరెడ్డి గారు

ఈ డైరీని ప్రకటింపవలసిన యక్కఱనుగుఱించి కొన్నిమాటలుఉపోద్ఘాత ప్రాయముగ చెప్పవలసి యున్నది. చిరకాలమునాడు దేశసంచారము చేయుటకై పోయియుండిన నాబాల్యమిత్రుడు రాఘవశాస్త్రి మొన్ననే యొకయుత్తరము వ్రాసెను.

ఆయుత్తరమును చదివిన వెంటనే ప్రవాసమునుండివచ్చిన మిత్రుని చూచినంత సంతోషమును దయించెను. ఈజాబుచేరిన మఱునాడు రెజిష్టరుడు పోస్టుద్వారా పంపబడిన నోటుబుక్కుకూడ నాకు చేరెను. పాఠకులకు ఉత్తరములోని విషయములు తెలియుటకొఱకు దానినిచ్చట పొందుపఱచితిని:

ప్రియమిత్రుడా:—

ఇంతకాలంవఱకు నీకు ఉత్తరము వ్రాయకుండా ఉండినందుకు మన్నించవలసిందని హృదయపూర్వకంగా వేడుకొంటున్నాను. రయిలుమార్గంగా యాత్రచేయవలసిందని మొట్టమొదట అనుకొన్నానుగాని, అదినాకు ఇష్టంలేక నైతేనేమి, ద్రవ్యాభావంచేతనైతేనేమి, తుదకు కాలిమార్గంగా యాత్రచేస్తున్నాను. ఈమధ్య నాకు జ్వరబాధచేత శరీరం అస్వస్థంగా వుండి ఈవూరి ఆసుపత్రిలో వారం దినములనుండి మంచం కరుచుకొని వున్నాను. ఈవిషయం మాయింట్లో చెప్పవద్దు.— నాకేమైన అపాయము సంభవిస్తే నా డైరి అన్యాక్రాంతం అవుతుందనే భయంచేత నీకు పంపుతున్నాను. నీకంటె నాకు ప్రియమిత్రులు లేరు. నా డైరీలో సారస్వతవిషయాలు, నాటకవిషయాలు, చిల్లర పొలిటిక్సు, ఇంకా యేమేమొ వ్రాసిపెట్టియున్నవి. అవి అన్నీప్రకటింపవలె ననుకొంటె ఆనందరంగంపిళ్ల డైరీకంటె పెద్దదవుతుంది. కాబట్టి ముఖ్యమైన విషయాలుమాత్రం ప్రకటింపవలసింది. దీనితోకూడా నాజీవితచరిత్రం లంకించినాను. ఆవశ్యక ప్రాయంగా జీవితచరిత్రం వ్రాయవలయు కొన్నాను గాని కవిని కానందువల్లనూ, లేనిదాన్ని సృష్టించడం నాచేత కాని దానివల్లనూ తుదకు ఉండినది ఉండినట్లె వ్రాయవలసివచ్చింది. ఈలోపాన్ని మన్నించవలసింది. ఇప్పటికే పెద్దజాబు వ్రాసి విసుగు పుట్టించినాను. ఒక్కమాట: మాతల్లిదండ్రులు, మామగారు, నాభార్యయేలాగా వుందోకూడా నాకు వుత్తరం వ్రాయవలసింది. నేను మళ్లీ యెప్పుడు వస్తానో ముందుగా చెప్పలేను.

ప్రియమిత్రుడు, రాఘుశాస్త్రి.

మొట్టమొదట అతని జీవిత చరిత్రమును ప్రకటించి తర్వాత నాతీఱీక ననుసరించి డైరీలోని విషయములనూ క్రమక్రమముగా ప్రకటించెదను.

జీవితచరిత్ర

అసలు నా డైరీని ప్రచురించడానికి పూర్వం నా సొంతచరిత్రంగూడా వ్రాసి డైరీకి అనుబంధంగా లంకించమని నాస్నేహితులకొందరి అభిప్రాయం. "నాస్నేహి

తులు” అని అనడంతోనే మీకు అనుమానం కలగడానికి యేలాటి అభ్యంతరమూ లేదు. “నాగ్రంథమును దిలకించి భాషాభిమానులైన నాప్రియస్నేహితులు కొందఱు దీనిని ప్రచురించుడని నన్ను పదేపదే కోరినందువల్లన వారిమాటలకు మాఱాడలేక యీచిన్ని కావ్యమును మీకందించుటకు సాహసించితిని.” అని పీఠికల్లో వ్రాసుకోవడం పోతన్న స్వప్నవృత్తాంతంలాగా చాలామంది గ్రంథకర్తలకి ఆచారమైంది కాబట్టి నాస్నేహితులుకూడా కవిసమయంలో అవతరించిన ఊహామూర్తులని మీరు భ్రమపడవద్దు. నేను వ్రాసేది కావ్యంకాదు గనుక ఆలాటిసందేహాలు కలగనవసరం లేదు.

డైరీలో విషయాలకి గౌరవం కలిగించడానికి వ్రాసిన పెద్దమనిషి జీవితవృత్తాంతంకూడ కొంచెం తెలిసి వుండడం భావ్యమని నామిత్రుల నమ్మకం. ఒకవేళ నా వుద్దేశంకూడాను. ఎవరికైనా వొకగ్రంథం పట్టుకెళ్లియిస్తె ముందుగా గ్రంథకర్త పేరు, అచ్చాఫీసు పేరు, ఉపోద్ఘాతం వ్రాసిన పండితుడి పేరు, అభిప్రాయాలిచ్చిన గొప్ప మనుష్యుల పేర్లు చూచుకొని తర్వాత పుస్తకం వెల గమనించి ముందుగా గ్రంథంపైన తమ అభిప్రాయం యేర్పరచుకొని అనంతరం చదవడం ప్రారంభిస్తారు. నాఱకోపరేషణలో కాస్తాకూస్తా తిరిగిన గ్రంథకర్తలు వ్రాసే పుస్తకాల్నిపత్రికలు ఆదరిస్తాయి. కొందరికి గ్రంథం యోగ్యత వెల తీర్మానిస్తుంది. కొందరికి వుపోద్ఘాతం ప్రమాణం. మరికొందరికి అచ్చులో పడ్డదంతా ప్రమాణం. ఈలాంటి ఆచారం నాకు తెలియకుండా నాలోనే దాగి వున్నదని నాకు సందేహంగూడాను. మాసపత్రికల్లో వచ్చే వ్యాసాలని, పద్యాలని ఆఖరు పేరు చూచే తోసివేస్తుంటాను. దురాచారాలు చాలాతొందరగా పట్టుబడతాయి. వదలించుకోవడం కనాగష్టం.

ఇంగ్లాండుదేశంలో ఒకరాజ్యాంగ తంత్రవేత్త “If you want to succeed flow with the current good or bad”అని అన్నాడు. నేనుగూడా ఆలాంటి Easy going philosophers తెగకు సంబంధించినవాణ్ణె కనుక లోకాన్ని ప్రతిఘటించి నిలుచుకోవడం ఇష్టంలేక, ఎట్లయినా సొంతచరిత్రం వొకటి వ్రాసి డైరీకి ఉపోద్ఘాతంమోస్తరుగా అంటింతామని సంకల్పించాను. అందులో మధ్య వొకసందేహం. సొంతచరిత్రం వ్రాస్తే యెక్కడ గొప్పమనిషి నాతానో అనేభయం కూడా పీక్కుతింటుంది. సామాన్యులెవరు తమచరిత్రాలను వ్రాసుకోరు. సామాన్యులెవరు స్వీయచరిత్రాలు వ్రాసుకోరు కాబట్టి వ్రాసుకొన్న వారందరు సామాన్యులుకారు అనే లాజిక్కులో పడ్డాను.

నేను కొంతమంది జీవితచరిత్రాలు చదివినాను. వాటన్నిట్లో సామాన్యంగా వుండేలక్షణాలు కొన్ని అవకుడుతవి. తల్లిదండ్రులు బీదవాళ్లుగానో, అనామికులుగానో, అప్రయోజకులుగానో వుంటారు. గొప్పవాడు కాబోయ్యే కుఱ్ఱవాడు స్వయంకృషిచేతనూ, తెలివితేటలచేతనూ అభ్యంతరాలన్నీ దాటి తుదకు పొద్దుపొడుపు సూర్యుడిమాదిరిగా ప్రకాశిస్తాడు. నాచరిత్రకూడా ఈమసోదాకు సరిపొయ్యేరకంగా వ్రాయవలసి వుంటుంది అన్నాను. నామిత్రుడు Mind, you are writing for the future అని అన్నాడు. వాడికి ఉత్సాహం కలిగినప్పుడు ఇంగ్లీషుతో మాట్లాడే అలవాటు. త్వరితం కొంచెం తగ్గినప్పుడు ఇంగ్లీషులో చెప్పినదానిని తెలుగులోకి తర్జుమాచేస్తాడు. “writing for the future” అంటె యేమిటి? అని అన్నాను. అది Genius యొక్క లక్షణం అని వాడు వాదించాడు. సమకాలీకులు తన్నుతెలిసికోలేరని చెప్పడం, భవిష్యత్ కాలానికిగా వ్రాస్తున్నానని తన్ను తాను వోదార్చుకోవడం Genius లో అంతర్గర్భితమని నామిత్రుడి విశ్వాసం. ఈ గొడవ గద్యం వ్రాసేవారికి పనిలేదని నేను చెప్పినాను. అర్థము స్ఫురింపని పదసమాసాలు గుప్పించే స్వతంత్రకవులు కొందరు భావప్రకటనా సామర్థ్యములేని లోపాన్ని ప్రతిభగా సమర్థించి యితరులను దూషించడమే గాకుండా భవభూతి తెచ్చుకొన్నంత కోపము తెచ్చుకొని “యేనామకేచిదిహనః ప్రథయంత్యవజ్ఞాం” అనే శ్లోకం నమూనాపెట్టుకొని పద్యాలువ్రాస్తారు. కొందరిపట్టుదలలుచూస్తే చిత్రంగావుంటుంది. Present generation నోట్లోమట్టిగడ్డకొట్టాలనే వుద్దేశం మనస్సులో పెట్టుకొని కవిత్వాలల్లుతున్నారు అనిఅన్నాను. నామాటలు నామిత్రుడికి కర్ణకఠోరంగావుండేవి.

నేను—ఒకవేళ నేనుజీవితచరిత్రం అదర్శక ప్రాయంగా వ్రాస్తే నాసంగతి తెలిసినవాళ్లు చూచి నవ్వుతారను కొంటూను.

మిత్రుడు—నీకేమాత్రం సందేహం వద్దు. ఎవరైనా సమకాలికులు కొంచెము హేళనంగా మాట్లాడినప్పటికీ "మానావమానములు దేహంబునకేగాని ఆత్మకులేవు" అనే పెద్దలవాక్యం చెప్పిన philosopher's breadth of mind తో కొంచెం వోర్చుకొంటె భవిష్యత్ కాలమంతా నీదే అవుతుంది. కాలంప్రతివాడికీ గౌరవం తెస్తుంది. బ్రతికి నన్నిదినాలు తిట్టిపోస్తుండే అత్తగారు కోడలు చచ్చినతర్వాత "మాకోడలంత వినయవతి నేను పుట్టిబుద్ధెరిగినాక చూడలే"దని వొట్టుపెట్టుకొంటుంది.

మిత్రుడివాదధోరణి నాకునచ్చింది. No greatness with-out sacrifice అని అన్నాడు. ఏసుక్రీస్తు ప్రజలను ఉద్ధరించడానికిగా కొరతబడి దేవుడికొడుకై ప్రతిక్రీస్తుదేవాలయంలో శిలువ అవతారంతో వెలుగుతున్నాడు. నేను మాత్రం మానాన్నియెందుకు బలియ్యకూడదు. Any sacrifice అని అన్నారు.

అయితే యిందులో నాకొక్క అనుకూలం. ఆదర్శకప్రాయమయిన జీవితచరిత్రవ్రాయడానికి సగము సామగ్రి చేకూరినట్లె. నేను గొప్పమనిషినానో కాదో అనేవిచారం లోకానికి వదలిపెట్టివేశాను. కాని దైవదత్తంగా మాతల్లిదండ్రులుమాత్రం బీదవాళ్లె. ఉద్యోగం వల్ల జీవనం. ఉద్యోగం అంతపెద్దదికూడా కాదు. తాలూకాకచ్చేరిలో మాతండ్రిగారు Despatching clerk గా నౌకరీచేసి ఆపదవికి చలనంలేకుండా పించెను పుచ్చుకొన్నారు. మేము యిద్దరము అన్నదమ్ములము. నేను పెద్దవాణ్ణి. చిన్నవాడు థర్డుఫారమువరకు చదివి పరీక్షలదినాల్లో అయ్యవారిపై తిరగబడి సస్పెండయి శుభ్రంగా యిల్లుచేరినాడు. పరీక్షకు పోకపోతే పరువు దక్కుతుందనే వుద్దేశంతో వాడట్లా చేశాడని బడిపిల్లల అభిప్రాయం. అందులో నేనుకూడా యేకీభవించాను.

నాయనగారి నసకోర్చుపడలేక వాడు పంచపాకేశయ్యరుగారి కాఫీహోటలులో నవుకరికి ప్రవేశించాడు. ఈనౌకరి మాతల్లిగారికి అవమానకరంగా వుండింది. ఈనౌకరీమూలంగా వాడిపైన కసితీర్చుకోవాలని మాతండ్రిగారి పట్టుదల. ఎవరిపుద్దేశాలు ఎట్లాగున్నా తేనేమి వాడికిమాత్రం మంచికాలం. చేరిన రెండునెలలు దాకా వాడు అమ్మినదానికంటె రెట్టింపుగా ఫలహారాలు తిన్నాడని హోటలుఅయ్యరు నాతో చాలా విసుగుకొన్నాడు. మంచిమాటలతో సరసపెట్టినాను. మాతమ్ముడు నేననుకొన్నంత తిండిపోతురామన్నగాదు. ఇప్పుడు స్వతంత్రంగా వొక కాఫీహోటలుపెట్టి కర్చులుపోను యిన్నూరురూపాయలు సంపాదించుకొంటూ యేగ్రాడ్యుయేటుకంటె కూడా నెమ్మదిగా సంసారము జరుపుకొంటున్నాడు.

మానాయనగారు Old lower secondry చదివినారు. ఆయన గుమస్తాగిరి చేస్తుండేటప్పుడు పొరుగింటి కామక్షమ్మ "మీయజమానుడు మాజిస్ట్రీటు అవుతాడటే!" అని మాతల్లిని అడిగిందట. ఆమాట యెట్లానో తల్లోదూరి మళ్లీ బయటికి రాలేదు. నీవెప్పుడు మేజిస్ట్రీటు అవుతావు అని పాప మాముసలాయన్ని ప్రతిదినం పీడిస్తూవుండేది. "మనకెవ్వరిస్తారే మేజిస్ట్రీటు ఉద్యోగం" అని మానాయనగారు ఒకొక్కసారి బతిమాలుకొన్నట్లూ ఒకొక్కసారి విసుగుకొంటూ కోపగించుకొంటూ చెప్పేవాడు. మాతల్లి నమ్మేదిగాదు. "మీదంతా ప్రతిదీపరిహాస్యమేనండీ" అని నిష్ఠూరా లాడేది. ఈపరస్పరం వాదప్రతివాదాలతోనే యిరవయినాలుగు సంవత్సరాలు గడచిపోయి మానాయనగారు పించను పుచ్చుకొన్నారు. నేను స్కూల్లో చదివేటప్పుడు "అబ్బాయీ, ఒకవేళ మీనాయన గొప్పవుద్యోగాలు చేయకపోయినా నీవైనా బియ్యే ప్యాసయ్యి మేజస్ట్రీటు ఉద్యోగంచేసి నాముచ్చట తీరుస్తావుగదూ" అని నన్ను ముద్దుపెట్టుకొని మాయమ్మనాకు జోబీనిండా పచనాలుగింజలు పోసేది. ఆమెకు అధికారంపైన కొంచెంప్రీతి. మాతండ్రిగారికి గొప్పతనంమీద యిష్టంలేక మేజస్ట్రీటు కాకుండా పోయినాడని ఆమె కనుమానం. నేను గొప్పవుద్యోగం చేస్తే చుట్టుపట్టుఇండ్ల ఆడవాళ్లని మజ్జిగతెచ్చిపోసే గొల్లదాన్ని కొంచెంగద్దించి మాట్లాడవచ్చునని ఆమెయిష్టం.

మానాయనగారి యిష్టంవేరే. నన్నువకీలు వృత్తికి తయారు చేయవలసిందని ఆయన పట్టుదల. నాబియ్యే

చదువుకే చాలాడబ్బు కర్చుపడ్డది. మాకుండే రెండెకరాల భూమి అడుమానంలో చిక్కుకొన్నది. మాఅమ్మనగలు గూడా కొన్ని అమ్మివేసి నాచదువుకే అర్పించింది. ఇక నాబియ్యేల్ చదువుకు డబ్బెవరిస్తారు? ఆవిషయం నాకు వదలిపెట్టవోయ్, నేనొకప్లాను వేసినాను అన్నాడు మాతండ్రి. వకీలైతే గౌరవానికి గౌరవం, ధనానికి ధనం Independence కు independence, public life,politics, patriotism హడావుడి రభసం, every blessed nonsense లో ప్రవేశింప వచ్చునని ఆయన తలంపు నాన్నా, యీ కాలంలో ప్లీడరీ వృత్తిలో లాభంలేదు. యింటికి రెండేసి మూడేసి బోర్డులు తగిలించి వుండడమేగాని గ్రాసానికి కూడా జరగడం కనాగష్టం అని నేను జాలిపడ్డాను. ఇదంతా వుత్తఅబద్ధం. మననెల్లూరుజిల్లా పుష్పకవిమానం వంటిది. ఎందరెక్కినా యింకొక్కరికిచోటు వుంటూనే వుంటుంది. ఆహా! Nature లో నూశావా యెంత inter-dependence యెంత compensation ! మన జిల్లాలో రెడ్లున్నారు. కల్పతరువులు! పాడియావులు! మనకు దేవుడు తెలివిచ్చినాడు. వాళ్లకి తెలివితక్కువ తనం యిచ్చినాడు. గోటితో పొయ్యేదగవును కొండంత చేస్తారు. ఆ-వూ- అంటె పార్టీలు పెట్టుకోవడం, కూనీలు, దొంగసివిలుకేసులు. కష్టపడి సంపాదించిన డబ్బు ప్లీడర్ల కాళ్లముందర పోసి దాసానుదాసులై ప్రవర్తించడం; పెద్దవాళ్లు సంపాదించిన మాగాణీభూములను అడుమానం పెట్టడం; ప్రయివేటుబ్యాంకులలో రెండు రూపాయలకు వడ్డీకి తేవడం; మూడుసంవత్సరాల్లో వడ్డీ అసలంత కావడం; అయ్యేకులోకం తెలియడం; పశ్చాత్తాపపడడం; వెనుకచింతించుట వెఱ్ఱితనమని స్నేహితులు తమాషాగా వోదార్చడం! ఇట్లాంటి పరిస్థితులలో ప్లీడరీవృత్తి లాభకారి కాదని చెప్పడం బుద్ధిమాంద్యమని మాతండ్రి నొక్కి చెప్పినాడు. ఆయనవుత్సాహాన్ని తొలగించడం కష్టము. ఎట్లా అయితేనేమి నాబియెల్ చదువుకు, నావివాహానికి కలసి వచ్చేటట్లు మానాయన ఒకపన్నాగం ఆలోచించాడు.

మాబంధువుల్లో కొంచెం డబ్బుగలిగిన శ్రోత్రియందారు ఢోకాయన వున్నాడు. వచ్చినపక్తాధాన్యం యింటికర్చులకు పెట్టుకొంటూ, యితరుల పనులుచేసి పెడ్తూ సాయంకాలం నాలుగుగంటలయ్యేసరికి ప్రొగ్రెసివ్ యూనియన్ రీడింగు రూములో హాజరవుతాడు న్యూసుపేపర్లకి యీయనంత faithful గా వుండేమనిషిని మరెవ్వరిని నేను చూడ్లేదు. అడ్వర్టైజ్మెంట్ల పేజీల మొదలుకొని Printed and published by so&so అనేవరకు వోపికతో చదువుతాడు. ఈయనగారు పేపరుతీసుకొంటె సాయంకాలముయెనిమిదిగంటలవరకు యింకొక్క నరమానవుడికి ఆశలేదు. యుద్ధకాలంలో కామయ్యశాస్త్రిఅంటె రీడింగురూముకు వచ్చేవారికంతా హడలు. లేటుగా ఆఫీసులకు పొయ్యేవారు, తొందరపని వుండి ఆదరాబాదరా పొయ్యేవారు కామయశాస్త్రి కనుబడితే దూరంగానేచూచి సందుదారులో జారుకొనేవారు. గ్రహచారంచాలక దొరికితే కనీసపక్షం ఒకగంటైనా నిలవేసి జర్మనుయుద్ధాన్ని గురించి సేనలునడిచిన స్ట్రాటజిక్ పాయింట్లనుగురించి laborious గా వివరించేవాడు. ఎవరూ అడగకపోయినా తానువ్రాస్తుండేయుద్ధచరిత్రం యింకా పూర్తిగాలేదు ఇంకాకొన్ని ఆథార్టీసు కావలె అని బలాత్కారంగా ప్రస్తాపించేవాడు. ఆయన్నుకొంచెము భూషించవలసింది అని అనుకొంటెshort-cut వొకటివుంది." యేమండి కామయ్యశాస్త్రిలుగారు మిమ్మల్ని walking encyclopaedia of war news అని రీడింగురూములో అంటుండినారండి" అంటెచాలు.

రీడింగురూము న్యూసుపేపర్లలో కొంతకాలము War news columns బహుచిత్రంగా మాయమైపోతుండేవి.కారణం తెలిసేదిలేదు.Librarian కు కామయ్యశాస్త్రిపై అనుమానం తట్టింది. కొంచెం ముక్కుపొడిపెట్టండి అని హఠాత్తుగా జోబీలో చేయిపెట్టేసరికి రెండు కాలముల రూటరు టెలిగ్రాముల తునకలు దొరికాయి! పాప మాయన బిత్తరపోయాడు. నాయుద్ధచరిత్రంలోకి ఆథారటీసుకావాలె అందుకోసం చింపుకొన్నాను అని గౌరవంగానె చెప్పినాడు. నీయుద్ధచరిత్రందొంగలుదోలా, అందరు చదివిందాకానైనా వుండనీయవయ్యా అని అందరూ చీవాట్లు పెట్టినారు.

ఒకతూరి రీడింగురూములో ఆయనకు, చాలాపరాభవంఅయింది. ఆంటివెర్ప్కోట జర్మనీవాళ్లు పట్టుకొ

న్నారని ఆవేళ పేపర్లో తెలిసింది. ఇక అక్కడ చదువు కొనేవాండ్లను సరిగా చదువనిచ్చినవాడు కాడు. ఆయన దగ్గర యుద్ధం జరిగిన నాలుగేళ్లు సర్వకాల సర్వావస్థల్లో రాయల్ అట్లాసు వుండేది. “యూరపు మ్యాపునిండా యెఱ్ఱసిరాచుక్కలూ గీతలూ. పేపరు చదువుకొనేవాళ్ల ముందు అట్లాసు పెట్టి “ఏమండి సూచారా యీమార్గంగా సేనలు నడిచాయి”... అనేసరికి “యిక్కా-మమ్మల్ని వూర్కే-వదలి పెట్టండి. మాకు గూడా దేవుడిచ్చిన మెదడుంది. కళ్లున్నాయి.” అనే వాళ్లు. పాపము యీలాగా ప్రతివారిదగ్గిర విసిరి కొట్లు తిని మెల్లగా యింటికి పొయ్యేవాడు.

కామ—ఏమె; యిట్రా. మళ్లీ పోదువు. నేను నిన్ననుకొన్నట్లే అయింది.

భార్య—ఏమీ – వాళ్లాపయికం యిచ్చారా. అయితే తేండి–పెట్టెలో పడవేస్తాను.

కామ—నీకేం పగలు నలభయిగెళ్లు పయికం తోనే కలవరింపుగా వుంది. ఆవైభవవిషయాలు నీతో చెప్పవచ్చినాననుకొన్నావా... అదికాదే – ఆంటివర్పు కోటా జర్మనీవాళ్లుపట్టుకొన్నారె. ఏడుమైళ్లదూరంలో వుండి మూడుదినాల్లో నాలుగుఫిరంగిదెబ్బలతో ధ్వంసం యించి పట్టివేశారె!

భార్య—యిందుకేనా నన్ను పిలవడం. మీకు యింతకంటె వేరే వుద్యోగం కనబళ్లేదు. ఆపెద్దవాళ్ల పుణ్యాన సంపాయించిన ఆకాస్తా శ్రోత్రియం వుండబట్టి ఈగంజినీళ్లయినా దొరుకుతున్నాయి. కట్టెలదొడ్డికి పోయి కట్టెలు ఎత్తించుకరమ్మని నెత్తిన నోరుపెట్టు కొని కొట్టుకోంగా యీనాడి వెధవను పంపించారు. ఆకుంకి పచ్చికట్టెలు తెచ్చి పడవేశాడు. ప్రొద్దుటినుండి వూదుతుంటె యింతవఱకు పోయి మండాలేదు మాడా లేదు. గంటలప్రకారం విస్తరిముందు కూసోవాలి. పాపం వండన్నా పెడ్తే తినసైనా తింటారు. అదెంత సుగుణం అని విసుగుకుంటూ భార్యయింట్లోకి పోతుంది.

“ఇంట్లోగాని బయటగాని డబ్బు-డబ్బూ-డబ్బూ-అని వొకటేగోల! విజ్ఞానంపైన యేమాత్రం ఆసలేదు. ఆదరణ లేదు. ఎక్కడపట్టినా స్వార్థపరత్వం-ఎగతాళి-హేళన-ఏదో పెద్దమహామ్మారిరోగం యీలోకాన్ని చుట్టుకొని కీల్చేస్తుంది” అని కామయ్యశాస్త్రిగారు మంచంమీద తుండుగుడ్డ పఱచుకొని నిదురపోవడం సామాన్యంగా ఆయన యుద్యోగం.

శాస్త్రిగారికి పెండ్లికి యెదిగిన వొక కొమార్తె వుంది. ఆస్తిలేకపోతే అంతసొగసైందని చెప్పడానికి వీలులేని సామాన్యరూపవతి. మానాయన లేనిపోని పను లుకల్పించుకొని వారియింటికి పోతూవస్తూ పాతబంధు త్వం కలియవేస్తూ మధ్యేమధ్యే నా తెలివితేటలు పొగు డ్తూవుండేవాడు. ప్రస్తుతరాజకీయ విషయాలనుగురించీ ఆంధ్రవాఙ్మయాన్నిగురించీ విధవా వివాహాలనుగురించీ ఆంధ్రపత్రికకు వ్యాసాలు వ్రాస్తుండేవాణ్ణి. ఆవ్యాసాలు పడ్డపత్రిక తీసుకొని మెల్లగా as if nothing happened to the world అన్నట్లు మానాన్న కామయ్యశాస్త్రి యింటికిపోయి యేవోన్యూస్ చదివినట్లుగా అభినయించి అకస్మాత్తుగా నావ్యాసాన్ని చూచినట్లుగా నటించేవాడు. అంతలో యేమండి సోమన్నశాస్త్రులు గారూ అందులో యేమన్నా చిత్రమైన న్యూస్ వుందా అని ఆయన అడిగేవాడు. ఏమీ లేదండి, మనవాడు న్నాడే రాఘవుడు భారతాన్నిగురించి వొక వ్యాసం వ్రాశాడు. అది అచ్చులో పడ్డాదండి. మనవాడిప్పు డిప్పుడు కొంచెం ప్రయోజకుడవు తున్నాడు. వాడికి వివాహం గూడ తలపెట్టుకొన్నాను అని మెల్లంగా unconcerned గా ఒకముక్క జారవిడిచేవాడు మా నాన్న. నాకున్నూ శాస్త్రిగారికిన్ని రీడింగురూములో మాటలు జరిగాయి. ఆయన వస్తుండగానే తలావొక్కొ క్క న్యూసుపేపరు అందరు జాగ్రత్త చేసుకొన్నారు. తీసుకొంటె యివ్వడని భయం. నేను గతసంవత్సరం పేపర్లో వొక అడ్వరిటయిసుమెంటుకొరకు వెదుకుతూ వుండినాను. కామయ్యశాస్త్రి నాదగ్గరకూర్చొని బహు దీనంగా పేపరు అడిగినాడు. నేను ధారాళంగా యిచ్చి నాను. నమ్మకంమీద తేదీచూడకుండా పేపరంతా చదివి టేబిలుపైన పెట్టినాడు. ఇట్లా అప్రయత్నంగా ప్రారంభమైన మాపరిచయం అన్యోన్యప్రశంసలవల్ల మఱి కొంత గాఢమైంది. ఆయనవ్రాసిన యుద్ధచరిత్రను నా కంటే వోపికతో వినేవాళ్లు ఇంకెవరూ లేరు. నా వ్యాసాన్ని ఆయనకంటె మెచ్చుకొనేవాళ్లు అంతగా లేరు. వొకరికి వొకరు అంతా ఆదరింపూను.

నావోర్చూ మానాయనగారి ప్రయత్నం గట్టెక్కింది. కామయ్యశాస్త్రిగారి కూతురినే నాకిచ్చి వివాహం చేసినారు. పెళ్లి అయింది మొదలుచేసి "ఏమండో మీ అల్లుణ్ణి బియ్యేల్‌కు చదివించరూ", అని మా నాయన అడిగేవాడు. మీ కెందుకండీ ఆవ్యామోహం. వాడి tendencies ప్రకారం develop కానీయండి. వాడికి పత్రికలకు వ్యాసాలు వ్రాయడంలో మహానిపుణత్వం వుంది. Geniusను ఇప్పుడెవ్వరును recogniseచెయ్యరు. second rate మనుష్యులదే కాలము. నాయుద్ధచరిత్రను గురించి యెవరైనా శ్రద్ధతీసుకొంటున్నారా. నేను మరణించినతర్వాత ఏసాహిత్య పరిషత్ వారికో నా పుస్తకం దొరికితే అప్పుడువారు ప్రచురిస్తే అది బయటికి వస్తుంది అని మా మామగారు చెప్పేవారు. సాహిత్యపరిషత్తు వాళ్లు పాతపుస్తకాలేగా అచ్చువేస్తారు అని మానాయనగారు అన్నారు. నేను వ్రాసినపుస్తకంగూడా పాతకాకితాలపైన్నే వ్రాస్తుంది. చాలాకాలం అయ్యేవఱకు వారిచేతుల్లో పడకుండా భద్రంచేస్తాను, అని మామగారన్నారు. మీపుస్తకాన్ని వాళ్లుఅచ్చువేయరండి. ఆపరిషత్తు కొన్ని మూలసూత్రాలపైన నడుస్తుంది. పుస్తకంపాతదిగావుండవలసింది. ఎంతపాతదైతే అంతమేలు. అచ్చువేయుటకు తగని చెత్తగావుండినప్పటికిన్నీ సరే కనీసపక్షం మున్నూరేండ్లవయస్సుండవలెను. మనుష్యులతలకాయలు Literary museums అని వీరిఅభిప్రాయం, అని మ నాన్న అన్నాడు. అందుకైతే నాపుస్తకం ఉపకరిస్తుందని మామగారు సంతోషపడ్డారు. 'అయితే మనపిల్లవాణ్ణి బియల్‌కు చదివించవద్దంటారా?' 'ఎందుకండివాడు యెడిటర్ కావలసినంత మనిషి. ఇటువంటివాడున్నాడని తెలిస్తే ఆంధ్రపత్రికకు సంపాదకుడుగా రమ్మనిపిలుస్తారు. ఇప్పటికే తెలిసివుంటుందనుకొంటాను.' ఈసంభాషణలు వినివిని నాయోగ్యతపై కొంచెము నాకు నమ్మకం పొటమరిస్తూవుండేది.

మాతండ్రిగారి యిష్టప్రకారం బియల్ చదవడమున్నూ, మా మామగారి భ్రాంతిప్రకారము నేను సంపాదకుణ్ణి కావడమున్నూ, మాతల్లిగారి అధికారేచ్ఛ ప్రకారం నేను మేజస్ట్రేటు కావడమున్నూ నాకు ఏమాత్రం యిష్టంలేదు. మాతల్లిదండ్రులకు ఆశాభంగం కలిగించే దుర్బుద్ధి నాకొకటి కలిగింది. దేశాటనం చేయవలసిందనే కోరిక అంతరంగంలో అడుగుభాగాన్నుంచి బొగడబొడిచి నేటికి పైకి తేలింది. దినదినం ప్రేరేపణ మిక్కుటమైంది. విదేశాలు చూడడానికి ప్రస్తుతం వీలు లేక పోయినప్పటికిన్నీ స్వదేశమైనా చూడవలసిందనే కోర్కె నన్ను బాధిస్తుండేది. చెప్పితే నాన్న వొప్పుకోడు. మామగారు కోపగించుకొంటారు. తల్లి కంటికి కడివెడునీళ్లకు ఏడుస్తుంది. భార్య యింకా సంసారానికి రాలేదు. ప్రణయసంబంధమైన చిక్కులు విరహాలు ఏమీ లేవు. యోచించినాను. ఏమీ తోచలేదు. మామగారు యింట్లోలేని సమయంచూచి శారదా అన్నాను భార్యను. ఏమండీ అన్నది.

నేను—నేనొకరహస్యం చెబుతాను. దాచివుంచుకోగలవా? మీ నాన్నకు అమ్మకు మరెవ్వరికి చెప్పగూడదు.

భార్య—పూర్వపతివ్రతలెవరైనా యీలా భర్తల రహస్యాలు దాచిపెట్టున్నారా?

నేను—చాలామంది.

భార్య—అట్లయితే చెప్పండి.

నేను—నాకుహిందూదేశమంతా ఒకమాటుతిరిగి చూడాలని బుద్ధిపుట్టింది. నాప్రయత్నానికి నీవుకూడా సహాయం చేస్తావుగదూ?

భార్య—నేను మిమ్మల్ని వదిలిపెట్టి వొక్కనిమిషంగూడా వుండలేనండి. రాముడితోగూడ సీత అరణ్యాలకు పోయింది. హరిశ్చంద్రుడితోగూడా చంద్రమతి అన్నీ అష్టకష్టాలు పడ్డది. దమయంతి సమాచారం మొన్న ఆంధ్రసభవాళ్లు వేసిన చిత్రనళీయంలో చూశాంగా; పతివ్రతలెప్పుడు వాళ్లభర్తల్ని వదలిపెట్టి వుండరట. యుద్ధంలోకిగూడా వాళ్లవెంబడి పోతారట. సత్యభామయుద్ధం చేసిందట గదండీ.

నేను—నేను రాముడిమోస్తరుగా పితృవాక్యపరిపాలనం చేయడానికి బియల్ చదవడానికి పోవడం లేదు. హరిశ్చంద్రుడిమాదిరిగా వొకసుగుణాని కొరకు నూటతొంభయి సుగుణాలను బలిచ్చి కష్టపడడానికి పోవడంలేదు. నలుడిమోస్తరుగా మీనాన్న ఆటలో

రాజ్యం పోగొట్టుకొని అడవిదారిపట్టడానికి తయారు కాలేదు. అట్లాంటి సమయంలో పతివ్రతలు భర్తల వెంటపడవచ్చును: నేను దేశంచూడడానికి పోతున్నాను.

భార్య—నేను మీవెంటరాకపోతే పతివ్రతను కానో యేమోనని భయమేస్తుంది(కళ్లనీళ్లు పెట్టుకొనును).

నేను—ఎందుకు ఏడుస్తున్నావు. నీకీపిచ్చ యెప్పుడు తల్లోకి యెక్కింది?

భార్య—ముగవేషంతో వుండే ఆడవాళ్లని మా నాన్న మీకిచ్చి పెండ్లి చేయలేదు.

నేను—వోయిబాబో! యెక్కడి దీపురాణధోరణి? ఒక్కనిమిషంలో మనము నాయికా నాయకుల మైనాము. ఏ ఆశుకవియైనా దగ్గరవుంటే మనలనుగురించి అడుగుతిప్పకుండా ప్రబంధం అల్లేవాడు! శారదా నిజం చెప్పు. ఎక్కడి వీమాటలు.

భార్య—రాముడు అరణ్యానికి పొయ్యేటప్పుడు సీతనుకూడా తీసుకొని పోనంటే సీత అట్లానిందించిందట.

నేను—అట్లాచెప్పు. My good god! నీవెక్కడ చదువుకొన్నావు?

భార్య—National School లో

నేను—ఓ say so, అందువల్లనే యీ Patriotic పాతివ్రత్యము! నీవు పతివ్రతవేనని certificate యిస్తాను. నీకాభయంలేదు.

భార్య—అయితే పతినివదలిపెట్టివుండిన పతివ్రతపేరు వొకటి చెప్పండి చూస్తాం.

నేను—నీకాపిచ్చ యింకాపోలేదు. ఎవరో వుంటారు-తలంపునకు రాలేదు—ఆ—ఊర్మిళ. లక్ష్మణుడి భార్య పణ్ణెండేళ్లు భర్తనువదలిపెట్టి అమ్మగారింట్లో వుణ్ణింది.

భార్య—ఆమె పేరు పతివ్రతలపట్టిలో లేదండి,

నేను—లేకపోతే మనము చేరుస్తాము. లక్ష్మణుడిభార్య పతివ్రతకాదని యెవరంటారో చెప్పమను చూస్తాం.

భార్య—అట్లయితే మీప్రయాణానికి నేనొప్పుకొంటానండి.

నేను—వొప్పుకోవడమేగాదు. ఈసంగతి యెవ్వరికీ తెలియకూడదు. మామగారు నిన్నడిగితే స్నేహితులను చూడడానికి ఉత్తరాదికి వెళ్లవలెనని అనుకొంటూ వుండినాడని చెప్పు. తెలిసిందా. సరేనన్నది భార్య. ఆవేళ రాత్రే నెల్లూరు వదలినాను—ఇంకా నాజీవితచరిత్రం పూర్తికాలేదు. నేను దేశాటనంచేసి యూరుచేరినతర్వాత నన్నెవరైనా గొప్పమనిషి అంటె అప్పుడు కొరవ పూర్తి చేస్తాను.

కేసబియాంక

నాళము కృష్ణారావు గారు

భగ్గుమని మండు నోడ పైభాగమందు
నిట్టనిలుచుండె బాలుండు నిబ్బరముగ,
తనదుజనకుని యానతి తలను దాల్చి;
పఱచి రెల్లరు నాతఁ డొక్కరుఁడు తక్క.

సంజ కెంజాయనడుమ భాస్కరుఁడు వోలె
దట్టముగ మండు మంటల నట్టనడుమ
విమలకాంతుల బాలుండు వెలుఁగుచుండె;
వీరరస మార! మూర్తిభవించె ననఁగ.

ఉజ్జ్వలంబుగ జ్వాలలు ప్రజ్వరిల్లె
కాని, యాబాలుఁ డొక్కింత కదలఁడయ్యె
తండ్రియానతి భక్తిమై తలనుదాల్చి;
బళిర! ఎంతటిధీరుండొ బాలకుండు?